ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 129 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | శనివారం 14 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ఈనెల 16న లోక్ సభ ముందుకు వన్ నేషన్-వన్ ఎలక్షన్

ఒకే దేశం... ఒకే ఎన్నికకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఈనెల 16న లోక్ సభ ముందుకు తీసుకురానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.



**దిల్లీ, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్):** దేశంలో జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 16న లోక్సభ ముందుకు వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి ఎన్నికల బిల్లును లోక్సభలో ప్రవేశపెట్టనున్నారు. లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేలా రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో అధికార భాజపా 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక అనే కీలక ప్రణాళిక అమలుదిశగా ముందడుగు వేసింది.మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాలను రాజ్యాంగ సవరణ బిల్లుతో అనుసంధానించేందుకు, చట్టాలను సవరించడానికి ఒక సాధారణ బిల్లుతో సహా రెండు ముసాయిదా చట్టాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇటీవల సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రెండు బిల్లుల్లో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు కాగా.. మరొకటి సాధారణ బిల్లు. మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని (పుదుచ్చేరి, దిల్లీ, జమ్మూకశ్మీర్) అసెంబ్లీలకు సంబంధించిన చట్టాలను సవరించేందుకు సాధారణ బిల్లును తీసుకొస్తున్నారు. క్యాబినెట్ ఎజెండాలో ఈ బిల్లులు లేకపోయినా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిల్షాల పట్టుపట్టడంతో ఇవి ఆమోదం పొందాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి.లోక్సభ, అసెంబ్లీ ఎన్నికలతోపాటే స్థానిక ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకోసం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టాలని సూచించింది. అయితే స్థానిక ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్రం.. లోక్సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు ఆమోదం తెలిపింది. దీనికి 50శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఎన్నికలనూ వాటితో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50శాతం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మద్దతు అవసరం. ఎన్డీయేకు అంత బలం లేదు. దీంతో ఇండియా కూటమిలోని కొన్ని పార్టీల మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఎలా సాధ్యమనేది బిల్లు ప్రవేశపెట్టినప్పుడు తేలుతుంది. 542 మంది సభ్యులు ఉన్న లోక్సభలో ఎన్డీయేకు 293 మంది మద్దతుంది. ఇండియా కూటమికి 235 మంది సభ్యులున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 361 మంది సభ్యుల మద్దతు అవసరం. బిల్లులపై సమగ్ర చర్చ జరగాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టాక పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ద్వారానే రాష్ట్రాల స్పీకర్లతో సంప్రదింపులు జరపాలని భావిస్తోంది.

# వైకాపా నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు:చంద్రబాబు

జమిలి అమల్లోకి వచ్చినా..ఎన్నికలు జరిగేది 2029లోనే అని సీఎంచంద్రబాబు అన్నారు.



**అమరావతి, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్):** జమిలి అమల్లోకి వచ్చినా.. ఎన్నికలు జరిగేది 2029లోనే అని సీఎం చంద్రబాబు అన్నారు. మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మా మద్దతు ప్రకటించాం. వైకాపా పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోంది. ఆ పార్టీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైకాపా చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలి" అని చంద్రబాబు తెలిపారు.

# చిలుకూరులో గురుకుల పాఠశాలను సందర్శించిన సీఎంరేవంత్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు.

**చిలుకూరు, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్):** రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్ను ప్రారంభించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ అమలు చేస్తున్నారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెనూ రూపొందించింది.గురుకులాల బాటలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు గురుకులాలను సందర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ పాఠశాలలో కామన్ డైట్ మెనూను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. షేక్పేట గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ( సందర్శించారు. తరగతి గదిలో డిజిటల్ బోర్డు పనితీరును పరిశీలించారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్లో గురుకుల పాఠశాలను మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి పరిశీలించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల, కళాశాలల్లో విద్యా బోధన, సమస్యలపై మంత్రి ఆరా తీశారు.

# పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నాం: సీఎం చంద్రబాబు

ఎస్ఏఎల్, నార్ఫండ్, ఎన్డీబీ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తో భేటీ అయ్యారు.

**అమరావతి, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్):** ఎస్ఏఎల్, నార్ఫండ్, ఎన్డీబీ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్తో భేటీ అయ్యారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులపై వారు చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తున్నామన్నారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఎస్ఏఈఎల్ అనుసరిస్తోన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించిందన్నారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి రైతుల ఆదాయాన్ని పెంచే ఈ తరహా ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్లో అమలు చేయడానికి పూర్తి సహకారం అందించే దిశగా తమ చర్చలు సాగాయని సీఎం అన్నారు. ఏపీలో ఎస్ఏఎల్ రెండు దశల్లో 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి పెట్టుబడులు పెట్టనుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అన్ని అనువైన పరిస్థితులపై చర్చించామన్నారు.



# ఇబ్బందులు రాకుండా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేపడతాం: సీఎం రేవంత్

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మరోమారు స్పష్టం చేశారు.



**హైదరాబాద్, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్):** ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. హైదరాబాద్లోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన గ్లోబల్ మాదిగ డే-2024 కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్ ద్వారా ఎస్సీ వర్గీకరణపై పార్టీ వైఖరిని ఖర్గే వెల్లడించారని సీఎం గుర్తు చేశారు. "ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో మా ప్రభుత్వం కీలకపాత్ర పోషించింది. వారం రోజుల్లో ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక వచ్చే అవకాశముంది. ఇబ్బందులు రాకుండా వర్గీకరణ ప్రక్రియ చేపడతాం. రాజకీయ, అధికార నియామకాల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారి ఓయూ వీసీగా మాదిగ వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాం" అని సీఎం వివరించారు.

# రాజ్యాంగాన్ని చూస్తే వాళ్ల ఆలోచనలు కనిపిస్తాయి : రాహుల్గాంధీ

రాజ్యాంగంలో భారతీయత లోపించింది' అంటూ హిందుత్వ సిద్ధాంత కర్త వీడీ సావర్కర్ గతంలో చేసిన వ్యాఖ్యలను లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు.



**దిల్లీ, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్):** రాజ్యాంగంపై హిందుత్వ సిద్ధాంత కర్త వీడీ సావర్కర్ గతంలో చేసిన వ్యాఖ్యలను లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్ సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మాట్లాడుతూ.. అధికార ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాజ్యాంగం, మనుస్మృతి మధ్య వైరుధ్యాన్ని వివరించారు. మనుస్మృతి సిద్ధాంతాలను అనుసరించి రాజ్యాంగం ఉండాలని సావర్కర్ విశ్వసించారని, కానీ, రాజ్యాంగాన్ని తెరచినప్పుడు అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూల ఆలోచనలు, వారి మాటలు అందులో కనిపిస్తాయన్నారు.రాజ్యాంగంపై శుక్రవారం జరిగిన చర్చలో కేంద్ర మంత్రి రిజిజు మాట్లాడుతూ.. చారిత్రక లోపాలను దాచిపెట్టి, అప్పటి కాంగ్రెస్.. రాజ్యాంగ అంశాలను ఎంపిక చేసిందని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరును విమర్శిస్తూ శనివారం చర్చను ప్రారంభించారు. దీనిపై రాహుల్ తీవ్రంగా మండిపడ్డారు. "రాజ్యాంగం ఆధునిక భారతావనికి సంబంధించిన ఓ డాక్యుమెంట్. కానీ, ప్రాచీన భారత విలువలూ అందులో ఉన్నాయి. సావర్కర్.. రాజ్యాంగాన్ని విమర్శిస్తే.. మీరు రాజ్యాంగ రక్షణ గురించి మాట్లాడుతున్నారు. మీ ఆత్మబంధువును అవహేళన చేసినట్లు అనిపించడం లేదా?" అని రాహుల్ చురకలంటించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా
రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# నంద్యాల రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



నంద్యాల క్రైం, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్ ఫారం పై ఒక గుర్తు తెలియని సుమారు 60 సం.ల వయస్సు గల వ్యక్తి శనివారం ఉదయం మృతి చెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించినందున పేరు, ఊరు లాంటి వివరాలు తెలియరాలేదు. మృతుడు తెలుపు రంగు దానిపై ఎరుపు, నీలం లైన్స్ గల నిండు చేతుల చొక్కా, అన్నీ రంగులు కలిసిన లుంగీ ధరించి ఉన్నాడు. మృతుని పక్కన లేధర్ చెప్పులు ఉన్నవి. మృతుడు సుమారు 5.6 అడుగుల మేర ఎత్తు ఉండి, చామనఛాయా రంగు కలిగి ఉన్నాడు. నంద్యాల జి.ఆర్.పి.ఎస్. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు నంద్యాల రైల్వే పోలీస్ వారిని సంప్రదించగలరని ఎస్ఐ కోరారు. వివరాలు తెలిసిన యెడల నంద్యాల జి.ఆర్.పి.ఎస్ ఎస్ఐ అబ్దుల్ జలీల్ 9440627653, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ 9490081633 నెంబర్లుకు ఫోన్ చేయవలసినదిగా వారు పేర్కొన్నారు.

# నేను చట్టానికి కట్టుబడి ఉంటా : అల్లు అర్జున్

చంచల్గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్ జూబ్లిహిల్స్ లోని తన నివాసానికి చేరుకున్నారు.



హైదరాబాద్, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): చంచల్ గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్ జూబ్లిహిల్స్లోని తన నివాసానికి చేరుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు."నేను చట్టాన్ని గౌరవించే పౌరుణ్ని. చట్టానికి కట్టుబడి ఉంటాను. బాధిత కుటుంబానికి మరోసారి సాన-ుభూతి తెలుపుతున్నా. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. 20 ఏళ్లుగా థియేటర్కు వెళ్లి సినిమా చూస్తున్నా. నా సినిమాలే కాదు.. మావయ్య సినిమాలూ చూశా. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. అభిమానం, ప్రేమతో అండగా నిల్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. నేను బాగున్నాను.. ఎవరూ ఆందోళన చెందవద్దు" అని అల్లు అర్జున్ పేర్కొన్నారు.తన నివాసానికి చేరుకున్న అల్లు అర్జున్కు కుటుంబసభ్యులు దిష్టి తీసి స్వాగతం పలికారు. తన కుమారుడు, కుమార్తెను ఎత్తుకొని అల్లు అర్జున్ భావోద్వేగానికి గురయ్యారు. సతీమణి స్నేహ ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు జైలు నుంచి విడుదలైన వెంటనే అల్లు అర్జున్ గీతా ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు అక్కడ న్యాయవాదుల బృందం ఆయనతో చర్చలు జరిపింది. 45 నిమిషాల పాటు న్యాయవాది నిరంజన్రెడ్డితో అల్లు అర్జున్ చర్చించారు. బెయిల్ వచ్చినా విడుదల ఆలస్యంపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆ తరువాత కార్యాలయం నుంచి అల్లు అర్జున్ తన నివాసానికి వచ్చారు.

# 'ఎక్స్'లో స్పందించేవారు.. గతంలో ఎందుకని గురుకులాల్లో తిరగలేదు?: మంత్రి పొన్నం

గడచిన పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ నాయకులకు కనీస చిత్తశుద్ధి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.



హైదరాబాద్, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): గడచిన పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ నాయకులకు కనీస చిత్తశుద్ధి లేదని మంత్రిపొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గురుకులాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. షేక్పేట్లోని గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి.. కలెక్టర్ అనుదీప్ తో కలిసి కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ అన్ని రకాలుగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెరుగైన విద్య, ఆహారం అందించే దిశగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు.డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచామని.. దానివల్ల రాష్ట్రంలో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. 'ఎక్స్' వేదికగా స్పందించే వారు.. గతంలో గురుకులాల్లో ఎందుకు తిరగలేకపోయారని పొన్నం ప్రశ్నించారు. విద్యార్థులందరూ కష్టపడి తమ కుటుంబానికి, తమ గ్రామాలకు పేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. వారికి ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# భారాస గురుకుల బాటతో రాష్ట్ర ప్రభుత్వంలో చలనం : కేటీఆర్

భారాస చేపట్టిన గురుకుల బాటతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.



హైదరాబాద్, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): భారాస చేపట్టిన గురుకుల బాటతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రస్తుతం సంక్షేమ పాఠశాలలను సంక్షోభంగా మార్చి భయాందోళనకు గురి చేశారని విమర్శించారు. భారాస పాలనలో విద్యార్థులు ఎవరెస్టు వంటి శిఖరాలు అధిరోహించారన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో విద్యార్థులను ఆసుపత్రి మెట్లు ఎక్కించారని ఎద్దేవా చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు."కాంగ్రెస్ పాలనలో సామాన్య విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు కలిగాయి. పాఠాలు చెప్పే చోట పాము కాట్లతో పసిబిడ్డల ప్రాణాలు పోయాయి. దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్టు ఇప్పుడు గురుకులాల బాటపట్టారు. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు.. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫొటోలకు పోజులు ఇవ్వడం కాదు.. పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండి. కెమెరాల ముందు హంగామా చేయడం కాదు.. గురుకుల బిడ్డల గుండెచప్పుడు వినండి. మంది మార్బలంతో దండయాత్ర చేయకండి.. సమస్యలను తీర్చే ప్రయత్నం చేయండి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ముగిసిన విజయ్ పాల్ కస్టడి.. పోలీసుల ప్రశ్నలకు దొరకని సమాధానాలు?

నాటి వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజుపై 2021లో సీఐడీ కార్యాలయంలో చోటుచేసుకున్న దాడి కేసులో అరెస్టై రిమాండ్లో ఉన్న విశ్రాంత అదనపు ఎస్పీ విజయా పాల్ను ప్రకాశం పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు.



ఒంగోలు, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): నాటి వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజుపై 2021లో సీఐడీ కార్యాలయంలో చోటుచేసుకున్న దాడి కేసులో అరెస్టై రిమాండ్లో ఉన్న విశ్రాంత అదనపు ఎస్పీ విజయపాల్ను ప్రకాశం పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. రెండో రోజు.. శనివారం ఉదయం నుంచి ప్రశ్నించిన పోలీసులు విచారణ అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్కు తరలించారు. సాయంత్రం గుంటూరులోని ప్రత్యేక న్యాయ-స్థానంలో హాజరుపరిచి తిరిగి జైలుకు తరలించనున్నారు.రఘురామకృష్ణరాజు కస్టడీలో ఉన్నప్పుడు కొట్టిందెవరనే దానిపైనే ప్రధానంగా ప్రశ్నించినట్టు తెలుస్తోంది. దర్యాప్తు అధికారి, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం 50 ప్రశ్నలు సంధించింది. అన్ని ప్రశ్నలకు అరకొరగా సమాధానం చెప్పిన విజయ్పాల్.. చాలా వరకు తెలియదు, గుర్తు లేదు అని సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. రఘురామను కొట్టిన నలుగురు వ్యక్తుల వివరాలను విజయాపాల్ నుంచి రాబట్టలేకపోయినట్టు తెలుస్తోంది.

# వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదలకు మేం సిద్ధం .. జగన్సిద్ధమా..? : సోమిరెడ్డి


జగన్ రైతులకు ప్రోత్సాహకాలు దూరం చేశారని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు.



అమరావతి, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): వ్యవసాయ శాఖను జగన్ నిర్వీర్యం చేసి.. రైతులకు ప్రోత్సాహకాలు దూరం చేశారనితెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. ప్యాలెస్లో గోళ్లు గిల్లుకుంటూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఏనాడైనా ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారా అని ప్రశ్నించారు. జగన్కు రైతు అనే మాట ఉచ్చరించే అర్హత లేదన్నారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని తొలిస్థానానికి తీసుకెళ్లిన ఘనత ఆయనదే అని ఎద్దేవా చేశారు. వైకాపా హయాంలో వ్యవసాయ రంగం చాలా నష్టపోయిందని మండిపడ్డారు. స్వర్ణాంధ్ర విజన్ - 2047 డాక్యుమెంట్లో వ్యవసాయానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. రేషన్ బియ్యం విదేశాలకు పంపి జగన్ రూ. కోట్లు దండుకున్నారని ఆరోపించారు.గత ప్రభుత్వ హయాంలో వ్యవసా-య రంగం ఎంత నష్టపోయిందో పులివెందుల రైతులే చెప్తారని అన్నారు. వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదలకు తాము సిద్ధం, వైకాపా సిద్ధమా అని సవాల్ చేశారు. దేశంలో రైతులపై తలసరి సగటు అప్పు రూ.74,500 ఉంటే ఏపీలో మాత్రం రూ.2.45 లక్షలు ఉండటానికి కారణం జగన్ కాదా అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.

# గ్రూప్ 2 పరీక్షల ఫలితాలు వేగంగా ఇస్తాం : టీజీపీఎస్సీ ఛైర్మన్

ఆదివారం, సోమవారం జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.



హైదరాబాద్, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): ఆదివారం, సోమవారం జరగనున్న గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. పది రోజులుగా అన్ని అంశాలను సమీక్షించామని చెప్పారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని.. పబ్లిక్ సర్వీస్ కమిషన్పై నమ్మకముంచి పరీక్షలు రాయాలని కోరారు. నాంపల్లి టీజీపీఎస్సీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "గ్రూప్ 2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దు. మెరిట్ ఉంటే మిమ్మల్ని ఎవరూ ఆపలేరు. 5.51 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ప్రతి ఒక్కరికీ బయోమెట్రిక్ తప్పనిసరి. ప్రశ్నాపత్రాలకు సంబంధించి 58 స్టోరేజ్ పాయింట్లు పెట్టాం. అభ్యర్థికి తప్ప ప్రశ్నాపత్రం ఎవరికీ తెలిసే అవకాశం లేదు. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ అమలుకు చాలా సమయం తీసుకున్నారు. ఈ సారి వేగంగా ఫలితాలు ఇస్తాం" అని బుర్రా వెంకటేశం తెలిపారు.

# రాజధాని ప్రాంతంలో మరో రూ.20వేల కోట్లతో అభివృద్ధి పనుల : మంత్రి నారాయణ

రాజధాని ప్రాంతంలో మరో రూ.20వేల కోట్లతో అభివృద్ధి పనులకు సోమవారం జరిగే అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు.



హైదరాబాద్, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని ప్రాంతంలో మరో రూ.20వేల కోట్లతో అభివృద్ధి పనులకు సోమవారం జరిగే అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలోని సీడ్ క్యాపిటల్ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం కానున్న రోడ్లను మంత్రి నారాయణ పరిశీలించారు. మొత్తం 20,017 చదరపు కిలోమీటర్ల పరిధిలో తూర్పు నుంచి పశ్చిమకు 16 రోడ్లు, ఉత్తరం నుంచి దక్షిణం వరకు 18 రోడ్లు వస్తున్నాయని మంత్రి చెప్పారు. గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా ఈ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. రాబోయే 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపడుతున్నట్లు నారాయణ వెల్లడించారు. రహదారి నిర్మాణాలతో ఇళ్లు కోల్పోతున్నవారు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

# కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం .. రూ.2 కోట్ల ఆస్తినష్టం!

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని మల్లికార్జున కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.



యాదాద్రి ,డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని మల్లికార్జున కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీగా పత్తి దగ్ధమైంది. మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఆస్తినష్టం రూ.2 కోట్లపైనే జరిగినట్లు సమాచారం. షార్ట్సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు అధికారులు గుర్తించారు.

# సాగునీటి సంఘాలు తెదేపా కైవసం

మండలంలో శనివారం జరిగిన ఆరు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి.

కలసపాడు, డిసెంబర్ 14, (రిపబ్లిక్ న్యూస్): మండలంలో శనివారం జరిగిన ఆరు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. వీటి పరిధిలోని 48 మంది సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తెదేపా కైవసం అయ్యాయి. రాజుపాలెం రాచెరువు అధ్యక్షుడిగా అన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.శివప్రసాద్, తడుకు వాగుకు అధ్యక్షునిగా గంగసాని వెంకటరెడ్డి, ఉపాధ్యక్షురాలుగా ఎస్.బి. అమీనాభి, రెడ్డి పల్లె చెరువు అధ్యక్షునిగా పి. పీరయ్య, ఉపాధ్యక్షుడిగా సి.రమేష్, కలసపాడు అప్పరు సగిలేరు ప్రాజెక్టు అధ్యక్షుడిగా కేవెన్ చిన్న రంగారెడ్డి ఉపాధ్యక్షుడిగా వావిళ్ళ రమణయ్య గారి గురయ్య, చింతలపల్లె చెరువు అధ్యక్షుడిగా యు. పెద్ద వెంకటయ్య ఉపాధ్యక్షుడిగా గాలి రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# హాలీవుడ్ యాక్టర్ విల్ స్మిత్ తో మంచు విష్ణు.. కొత్త ప్రాజెక్ట్

తెలుగు సినీ నటుడు మంచు విష్ణు మరో కీలక రంగంలోకి అడుగు పెడుతున్నారు. తరంగ వెంచర్స్ పేరుతో మీడియా, ఓటీటీలకు సంబంధించిన నూతన టెక్నాలజీలను ఇండస్ట్రీకి అందుబాటులోకి తీసుకురానున్నారు.



నటుడు, నిర్మాత, విద్యా సంస్థల నిర్వాహకుడిగా రాణిస్తున్న మంచు విష్ణు మరో అడుగు ముందుకు వేశారు. తరంగ వెంచర్స్ పేరుతో ఆయన మీడియా, ఎంటర్టైన్మెంట్ టెక్నాలజీ రంగంలోకి అడుగు పెడుతున్నారు. 50 మిలియన్ దాలర్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న ఈ సంస్థలో హాలీవుడ్ ప్రముఖ నటుడు విల్స్మిత్ కూడా భాగస్వామి అయ్యేందుకు సుముఖంగా ఉన్నట్లు విష్ణు తెలిపారు. ఇందుకు సంబంధించిన చర్చలు చివరి దశలో ఉన్నట్లు వెల్లడించారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన శుభవార్త వింటారని తెలిపారు.తరంగ వెంచర్స్ ముఖ్యంగా ఇండస్ట్రీకి అవసరమయ్యే నూతన టెక్నాలజీస్పై పెట్టుబడులు పెట్టనుంది. ఓటీటీ వేదికలు, యానిమేషన్, గేమింగ్, బ్లాక్ చెయిన్, సరికొత్త టెక్నాలజీలైన ఏఆర్, వీఆర్, ఏఐ వంటి సాంకేతికతకు సంబంధించిన సేవలను అందించనుంది. వినోద రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోనుంది. తరంగ వెంచర్స్లో మంచు విష్ణు, ఆది శ్రీ ప్రద్యుమన్ ఝూలా, వినయ్ మహేశ్వరి, విల్స్మిత్, దేవేష్ చావ్లా, సతీష్ కటారియాలు భాగస్వాములుగా ఉన్నారు. వీరే కాకుండా మరికొందరు కూడా తరంగ వెంచర్స్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇటు భారత్, అటు డెలవర్ లోనూ ఆసక్తి చూపుతున్నారు.కొత్త వాళ్లకు ఆర్థికంగా సహాయం చేయడం మాత్రమే కాదు, మార్గ నిర్దేశత్వం, స్టార్టప్స్కు వ్యూహాత్మక ప్రణాళికలను తరంగ వెంచర్స్ అందించనుంది. 'భవిష్యత్ మీడియా, ఎంటర్టైన్మెంట్ రంగంలో విప్లవాత్మకంగా అడుగులు వేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక సాంకేతికలను ఉపయోగించి సృజనాత్మక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టబోతున్నాం' అని మంచు విష్ణు తెలిపారు. ప్రస్తుతం ఆయన కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప' ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. భారీ బడ్జెట్తో రూపొందిస్తున్న ఈ మూవీ దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకొంటోంది. మోహన్ బాబు, శరత్కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న కన్నప్పలో ప్రభాస్, మోహన్లాల్, అక్షయ్కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు. ఏప్రిల్ 25, 2025న మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## పుష్పరాజ్ లాంటి వ్యక్తులు బయట కూడా ఉన్నారు : రష్మిక

'పుష్ప2', 'యానిమల్ సినిమాల్లో హీరోల పాత్ర గురించి రష్మిక మాట్లాడారు. పుష్పరాజ్ లాంటి వ్యక్తులు బయట కూడా ఉన్నారన్నారు.



రష్మిక సినీ ప్రయాణంలో 'పుష్ప 2', 'యానిమల్ చిత్రాలు కీలకమైనవి. ఆమెకు భారీ విజయాలను అందించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చాయి. అయితే ఈ రెండు సినిమాల్లో హీరోల పాత్రలపై కొన్ని విమర్శలు ఎదురైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశంపై రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. కథ ఆధారంగా పాత్రలు ఉంటాయన్నారు."కథ ఆధారంగానే అందులో ఏ పాత్రను హైలైట్ చేయాలో ఆలోచిస్తారు. హీరో దృష్టి కోణంలో రాస్తే అతడి పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. హీరోయిన్ కోసం కథ రాస్తే ఆమెను హైలైట్ చేస్తారు. ఇక పాత్రల స్వభావాలు కూడా స్టోరీ ఆధారంగానే ఉంటాయి. మనుషులందరిలో మంచి, చెడు రెండు గుణాలు ఉంటాయి. మా అమ్మ ఎప్పుడూ ఒక విషయాన్ని చెబుతుంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యత్యాసం.. వారి స్వభావం ఆధారంగానే ఉంటుందని అంటుంది. మనందరం పీల్చే గాలి, తినే ఆహారం, తాగేనీళ్లు అన్నీ ఒక్కటే. కాకపోతే ఈగో వల్లే ఇద్దరి వ్యక్తుల మధ్య వ్యత్యాసం వస్తుంది. అలాంటప్పుడు సినిమాల్లో పాత్రలను నిందించడం తప్పు. పుష్పరాజ్ పాత్ర స్వభావాన్ని అలా ఉండడం అతడి నైజం. అలాంటి వ్యక్తులు బయట సమాజంలో కూడా ఉన్నారు" అని తెలిపారు.ఆయా చిత్రాల్లో చూపించిన తీవ్ర హింసను ఉద్దేశించి.. "ఒకవేళ నిజ జీవితంలో 200 మందిని చంపితే జైల్లో ఉంటారు. అదే సన్నివేశాన్ని సినిమాలో చూపిస్తే అందరూ ఎంజాయ్ చేస్తారు. అలా వినోదాన్ని ఎంజాయ్ చేస్తున్నారు కాబట్టే, అవి భారీ వసూళ్లను సొంతం చేసుకుంటున్నాయి' అని అన్నారు. ఇక 'యానిమల్' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన పుష్ప2.. ఆరు రోజుల్లోనే రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు చేసి చరిత్ర సృష్టించింది. కలెక్షన్లలో దీని హవా ఇంకా కొనసాగుతూనే ఉంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1914: పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన మాకినేని బసవపున్నయ్య జననం (మ. 1992).
- 1924: భారతీయ చలనచిత్ర నటుడు రాజ్ కపూర్ జననం (మ.1988). (చిత్రంలో)
- 1965: నవలా రచయిత, నాటకకర్త జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి మరణం (జ.1906).
- 1982: తెలుగు, తమిళ నటుడు ఆది పినిశెట్టి జననం.
- 1998: ఆలమట్టి ఆనకట్ట ఎత్తును 509మీ. కంటె పెంచరాదని, కర్ణాటక స్వంత పూచీకత్తుపై 26 క్రెస్టు గేట్లను అమర్చుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.
- 2008: రచయిత, కవి, నాస్తికుడు, భారత చైనా మిత్రమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్వాలాముఖి మరణం (జ.1938).

మరిన్ని వివరాలకి డిసెంబర్ 14 చూడండి.


బసవపున్నయ్య


రాజ్ కపూర్


ఆది పినిశెట్టి


సుప్రీం కోర్టు


జ్వాలాముఖి

రిపబ్లిక్ సినిమా CINEMA

## డ్యాన్స్ తో అదరగొట్టిన రాజమౌళి దంపతులు.. వీడియో వైరల్

దర్శకుడు రాజమౌళి మరోసారి తనలోని డ్యాన్స్ టాలెంట్ను బయటపెట్టారు. తన సతీమణితో కలిసి రవితేజ సినిమాలోని పాటకు స్టెప్పులేశారు.





వృత్తిపరంగా ఎంతో బిజీగా ఉంటారు దర్శకధీరుడు రాజమౌళి వరుస షూటింగ్స్ వర్క్తో ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీకి మాత్రం సమయం కేటాయిస్తుంటారు. పర్సనల్ లైఫ్లోని ప్రతి క్షణాన్ని సరదాగా ఆస్వాదిస్తుంటారు. గతంలో ఓ పెళ్లి వేడుకలో డ్యాన్స్ చేసిన అలరించిన ఆయన.. మరోసారి తనలోని డ్యాన్స్ టాలెంట్ను బయటపెట్టారు. తన సతీమణి రమా రాజమౌళితో కలిసి 'అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి' చిత్రంలోని 'లంచ్ కొస్తావా మంచె కొస్తావా' పాటకు స్టెప్పులేశారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారింది. ఫ్యామిలీ ఫంక్షన్లో ఈ దంపతులు డ్యాన్స్ చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఇది ఎవరి ఫంక్షన్ ? ఎప్పుడు జరిగింది? అనేది తెలియరాలేదు.రాజమౌళి ప్రస్తుతం మహేశ్బాబుతో సినిమా చేస్తున్నారు. త్వరలో ఇది పట్టాలెక్కనుంది. ఇది ప్రచారంలో ఉంది. యాక్షన్ అడ్వెంచర్గా సిద్ధం కానుంది. భారీ బడ్జెట్తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో పలువురు హాలీవుడ్ టెక్నీషియన్స్ భాగం కానున్నారు. ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్గా నటించే అవకాశం ఉందని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన లొకేషన్స్ సెర్చ్ భాగంగా ఇటీవల ఆఫ్రికాలోని అడవుల్లో పర్యటించారు. ఈ సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నాకు జంతువులంటే ఇష్టం. తో సహా గతంలో నేను తీసిన సినిమాల్లో జంతువులను ఉపయోగించాను. ఒక విషయం అయితే కచ్చితంగా చెప్పగలను. 'ఆర్ఆర్ఆర్ కంటే ఎక్కువ జంతువులు నా తదుపరి మూవీస్లో ఉంటాయి" అని వెల్లడించారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## గబ్బాలో తొలిరోజు వరుణుడిదే ఆధిక్యం.. ముగిసిన ఆట

గబ్బా వేదికగా ప్రారంభమైన మూడో టెస్టు మ్యాచ్కు వర్షం తీవ్ర ఆటంకం కలిగింది. ఒక్క సెషన్ కూడా పూర్తిగా సాగలేదు.



బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో మూడో టెస్టుకు - వరుణుడి గండం ఎదురైంది. గబ్బా వేదికగా మొదలైన మ్యాచ్లో తొలి రోజు కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. దాదాపు రెండున్నర సెషన్ల ఆట వర్షార్పణమైంది. టాస్ నెగ్గిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ తొలిరోజు ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. క్రీజ్లో నాథన్ మెక్స్వీనీ (4Ï), ఉస్మాన్ ఖవాజా (19Ï) ఉన్నారు. భారత బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, ఆకాశ్దీప్ కట్టుదిట్టంగా బంతులేసినా ఆసీస్ మాత్రం వికెట్ ఇవ్వలేదు. ఆదివారం అదనంగా కొన్ని ఓవర్లు ఇవాళ కేవలం గంట ఆట మాత్రమే సాధ్యం కావడంతో రెండో రోజు (ఆదివారం) అదనంగా ఓవర్లను పొడిగించడం విశేషం. వాతావరణం అనుకూలిస్తే 98 ఓవర్లపాటు ఆట జరిగే అవకాశం ఉంది. ఆటను కూడా అర్ధగంట ముందుగానే ప్రారంభిస్తారు. అయితే, వాతావరణ శాఖ మాత్రం ఈ వారమంతా వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు చెబుతోంది. దీంతో మ్యాచ్ ఫలితం చూస్తామా? లేదా? అని అభిమానుల్లో టెన్షన్ నెలకొంది. మరో వైపు మ్యాచ్ను చూద్దామని వచ్చిన అభిమానులకు ఇవాళ తీవ్ర నిరాశే ఎదురైంది. కానీ, క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం వారికి ఊరటనిచ్చేలా టికెట్ల సొమ్మును రిఫండ్ చేస్తామని ప్రకటించింది్న తొలి సెషన్ : ఉదయం 5.20 గంటల నుంచి 7.50 గంటల వరకు్న లంచ్ బ్రేక్: ఉదయం 7.50 నుంచి 8.30 వరకు్న రెండో సెషన్: ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు్న టీ బ్రేక్: ఉదయం 10.30 గంటల నుంచి 10.50 గంటల వరకు్న మూడో సెషన్: ఉదయం 10.50 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు్న పూర్తి ఓవర్ల కోటాను వేయించేందుకు అవసరమైతే మధ్యాహ్నం 1.20 గంటల వరకు పొడిగించే అవకాశంభారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ కుమార్తె సారా తెందూల్కర్ బ్రిస్బేన్లో కనిపించారు. మూడో టెస్టు మ్యాచ్ను వీక్షించేందుకు మైదానానికి వచ్చింది. భారత మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్ కూడా లైవ్ స్ట్రీమింగ్లో కనిపించారు.

## రిలేషన్ షిప్స్




## కోడలు పొరపాటున కూడా అత్తతో ఇలాంటి మాటలు మాట్లాడకూడదు ..భర్తతో కూడా చెడుతుంది..

ప్రతి అమ్మాయి పెళ్లయ్యాక మెట్టినింటిని వదిలి అత్తింట్లో అందరితో కలిసి జీవించాల్సి ఉంటుంది. ముఖ్యంగా కోడలుగా అత్తమామల్ని మెప్పించాల్సి ఉంటుంది. అయితే.. అందరితో మంచి రిలేషన్ మెయింటైన్ చేస్తేనే మీ వైవాహిక జీవితం హాయిగా పోతుంది. ఏ చిన్న గొడవైనా సరే మీ ఇంటి వాతావరణాన్ని పాడుచేస్తుంది. కోడలు ఇంట్లో ఎలా నడుచుకోవాలన్న దానిపై పుస్తకాలంటూ ఏం లేవు. మన ప్రవర్తించే తీరు, మాట్లాడే మాటల మీద అంతా ఆధారపడి ఉంటుంది. భర్త ఎంత సపోర్ట్ ఇచ్చినా.. అత్తగారి దగ్గర మాత్రం జాగ్రత్తగా ఉండాల్సిందే. వారిని కూడా మెప్పించేలా ప్రయత్నాలు చేయాలి.అలానే, అత్తగారింట్లో కూడా అందరూ కోడలి విషయంలో చాలా సాఫ్ట్గా ఉంటారనుకోలేం.కొందరు మాత్రమే కోడల్ని కూతురిలా చూసుకుంటారు. ఏదేమైనా... కొత్త వాతావరణం, కొత్త కుటుంబానికి సరిపోయేలా ఉండటం అంత ఈజీ కాదన్నది నమ్మాల్సిన వాస్తవం. కోడలిగా తనను తాను నిరూపించుకోవాలంటే చాలాసార్లు తన మనసు చంపుకోవలసి వస్తుంది. ఒక్కోసారి అత్తగారు, మామగారు, భర్తల మధ్య జరిగే సంఘటనలు వింతగా అనిపించవచ్చు. అయితే, ఇలాంటి సమయాల్లో ఇంటి కోడలికి కొన్ని పరిమితులు ఉంటాయి. కొన్ని సార్లు మౌనంగా ఉండటమే మేలు. అలానే, కొన్ని విషయాల్ని లేదా మాటల్ని అత్తగారి ముందు అనకూడదు. ఎలాంటి మాటలు మాట్లాడకూడదో ఇక్కడ తెలుసుకుందాం.

### మీ అబ్బాయికి ఏం నేర్పించారు?'




ఈ మాట అత్తతో అస్సలు అనకూడదు. ఈ మాట అంటే మీ అత్తగారు చాలా బాధపడే అవకాశం ఉంది. తన కొడుకును సరిగ్గా పెంచలేదన్న భావన, అభిప్రాయం ఆమెలో మెదలుతుంది. దీంతో.. చాలా బాధపడుతుంది. ఈ మాట అనడం వల్ల మీ అత్తగారిని అవమానిస్తున్నారని గుర్తించుకోవాలి. ఇది మీ సంబంధాన్ని మరింత దిగజార్చవచ్చు.

### 'మీ వల్లే మాకు గొడవలు'



ఈ మాట కూడా మీ అత్తగారితో అనకండి. ఇలా అనడం కచ్చితంగా అత్తని నిందించడమే. ఇది మీ సంబంధాన్ని చెడగొట్టవచ్చు. ఎందుకంటే మీకు, మీ భర్తకు మధ్య గొడవకు అత్తగారు మాత్రమే కారణమని ఈ మాటకి అర్థం. ఇలా చెప్పడం ద్వారా అత్తగారు మీకు శత్రువుగా మారతారు. ఆ తర్వాత ఇంటి వాతావరణం చెడిపోతుంది. ఈ ఒక్క మాట కారణంగా ఆమె ఎప్పుడూ కూడా మీకు అనుకూలంగా మాట్లాడటానికి సిద్ధంగా ఉండదు




### మీ కంటే నీ కొడుకు గురించి నాకు బాగా తెలుసు



ఈ మాట అనడం ద్వారా అత్తగారి మాటలకు మీరు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అర్థం. అంతేకాకుండా ఆమె అనుభవాన్ని మీరు తక్కువ అంచనా వేస్తున్నారని ఓ భావన ఏర్పడుతుంది. ఈ మాట పదే పదే అంటే మీ అత్తగారి బాధపడవచ్చు. అంతేకాకుండా ఆమెకు మీపై కోపం పెరగవచ్చు. ఈ విషయాన్ని మీ భర్తతో చెబితే గొడవలు అయ్యే అవకాశం ఉంది.

### 'నా పిల్లలను నేనే చూసుకోగలను'



ఏ అత్తకైనా సరే కొడుకు పిల్లలంటే చాలా ఇష్టం ఉంటుంది. మీ పిల్లల్ని చూసుకోవడం వారికి కష్టంగా ఉండదు. వారు ప్రేమ, బాధ్యతగా ఫీలవుతారు. అలాంటప్పుడు ఈ మాట అస్సలు అనకూడదంటున్నారు నిపుణులు. ఈ మాట వల్ల మీ అత్తగారి సాయం తీసుకోవడానికి మీరు నిరాకరిస్తున్నారని అర్థం. ఇది వారికి చాలా బాధను కలిగిస్తుంది. అంతేకాకుండా తనను చాలా తక్కువ చూపు చూస్తున్నారని అర్థమవుతుంది.



### 'నేను ఏది చేసినా మీకు తప్పే'



ఇంటిని నిర్వహించడంలో కోడలిది కీలక పాత్ర. అలాంటప్పుడు పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. ఈ పొరపాట్లు జరిగినప్పుడు అత్తగారు చనువుతో లేదా కోపంతో ఓ మాట అంటే దానికి ఇలాంటి మాటలు ఎదురు చెప్పకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇలా చెప్పడం వల్ల మీ మధ్య సఖ్యత దెబ్బతింటుంది. అంతేకాకుండా మీ తప్పుల వెతికే పనిలో అత్తగారు ఉన్నారని అర్థం వస్తుంది. ఆ తర్వాత ఈ విషయాలు భర్తకి తెలిస్తే గొడవలు మొదలవుతాయి.

### అత్తతో కోడలు ఎలా ఉండాలి?



మీ అత్తగారితో సానుకూల వైఖరిని కొనసాగించండి. ఆమెలో మంచి గుణాలు ఉంటే వారిని ప్రశంసించడంలో ఆలస్యం చేయకండి. మీ అత్తగారితో బహిరంగంగా, నిజాయితీగా మాట్లాడండి. మీ భావాలను సున్నితంగా ఆమెకు తెలపండి. ఏ సమస్య వచ్చినా మీ అత్తగారితో కలిసి పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఒకరి మాటలు మరొకరు శ్రద్ధగా వినండి. ఏ బంధం అయినా నిలబడటానికి ఓపిక అవసరం. కాస్త ఓపికతో అత్తగారితో మంచి రిలేషన్షిప్ ఏర్పర్చుకోవడానికి ప్రయత్నించండి. అత్తగారి ప్రవర్తనను గమనించండి. ఆ తర్వాత ఆమెతో ఎలా మెలగాలో మీకే అర్థమవుతుంది. ఆమెకు నచ్చిన పనులు చేసి అత్తగారి హృదయంలో స్థానం సంపాదించుకోండి.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. అత్త, కోడలు మధ్య సంబంధం చాలా సున్నితమైనది. ఆయా వ్యక్తుల్ని బట్టి ఫలితాలు మారుతుంటాయి. ఇది ఎవర్నీ ఉద్దేశించినది కాదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.